# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 20-02-2016**

జిహెచ్ఎంసితో పాటు రాష్ట్రంలోని అన్ని కార్పోరేషన్లు, మున్సిపాలిటీలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి, ఆయా పట్టణాలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం పట్టణాభివృద్ధి శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. మంత్రులు కె.టి. రామారావు, ఈటెల రాజెందర్, ఎ.ఇంద్రకరణ్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సీనియర్ అధికారులు నర్సింగ రావు, ఎకె గోయల్, జనార్థన్ రెడ్డి, దానకిషోర్, ఎంవిఎస్ రెడ్డి, రామకృష్ణారావు, శివశంకర్, నవీన్ మిట్టల్, బిపి ఆచార్య, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాహుల్ బొజ్జా, రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ద్వారా వచ్చే పైపులైన్లకు అనుబంధంగా పట్టణ ప్రాంతాల్లో అంతర్గత పైపులైన్లు నిర్మించి, ప్రతీ ఇంటికీ నల్లా ద్వారా మంచినీళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఎం కోరారు. కొత్తగా మున్సిపాలిటీలుగా మారిన పట్టణాల్లో గ్రామీణ మంచినీటి పథకం ఆధ్వర్యంలోనే మిషన్ భగీరథ పనులు చేయాలని, పాత మున్సిపాలిటీలలో పబ్లిక్ హెల్త్ ద్వారా పనులు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపలున్న 190 గ్రామాల పరిధిలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో నీళ్లు అందివ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, రామగుండం కార్పోరేషన్లకు వాటి ఆదాయ, వ్యయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంటు ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. స్థానికంగా సమకూరే ఆదాయంతో పాటు ప్రభుత్వం ఇచ్చే గ్రాంటును సద్వినియోగపర్చుకుని ఆయా పట్టణాలు, నగరాలను అభివృద్ధి చేయాని కోరారు. ప్రతీ నగరం, పట్టణానికి సంబంధించి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకుని కార్యాచరణ ప్రకారం ముందుకు పోవాలన్నారు.

హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఈ ఏడాది నిర్మించాలని తలపెట్టామని, అందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. బ్రిక్స్ బ్యాంకుతో పాటు అనేక సంస్థలు హైదరాబాద్ నగరావృద్ధి కోసం చేసే కార్యక్రమాలకు నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. విశ్వనగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దే క్రమంలో అధికారుల పాత్ర చాలా కీలకమన్నారు. హైదరాబాద్ కు రెండు డెడికేటెడ్ డ్రింకింగ్ వాటర్ రిజర్వాయర్లు కట్టాలని నిర్ణయించామని, ఈ పనులు కూడా వేగంగా జరిగేట్లు చూడాలన్నారు. నగరంలో సీవరేజి, డ్రింకింగ్ వాటర్, మల్టిలెవల్ ఫ్లై ఓవర్లు, డ్రైనేజీలు, స్కైవేలు, హెచ్ఎండిఏ జోనింగ్ పై ప్రణాళికలు రూపొందించాలన్నారు. వచ్చే మూడేళ్ల కోసం కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రజలపై భారం పడకుండా ఆదాయ మార్గాలు పెంచుకునే ఆలోచన చేయాలని సూచించారు. కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, మెట్రో వాటర్ వర్క్స్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల్లో అవినీతి పెద్ద ఎత్తున ఉందని, దీనిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలు లంచం ఇవ్వకుండా మున్సిపాలిటీలలో అనుమతులు పొందినప్పుడే సుపరిపాలన అందినట్లుగా భావించాలని చెప్పారు. ప్రజల మద్దతు సంపూర్ణంగా లభించిన ప్రభుత్వం వందకు వంద శాతం ప్రజల పక్షాన్నే నిలబడాలని సూచించారు.

వరంగల్లో ఐటిని విస్తరించాలి

-----------------------------

హైదరాబాద్ తో పాటు వరంగల్ నగరానికి ఐటి రంగాన్ని విస్తరింపచేయాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. మంత్రి కె. టి. రామారావు, ఐటి కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులతో కలిసి ఐటి శాఖపై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎన్నో ప్రముఖ కంపెనీలు హైదరాబాద్ లో తమ ప్రధాన కార్యాలయాలు పెట్టడానికి ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. ఎక్కువ మందికి ఉపాధి కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఐటి రంగం దోహదపడుతున్నదన్నారు. ఈ వాతావరణం కొనసాగించడానికి కృషి చేయాలని సూచించారు. ఐటి కంపెనీలతో పాటు ఇతర కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద వచ్చే నిధులన్నింటినీ ఒకే దగ్గరికి చేర్చి ప్రజల అవసరాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలను బట్టి ఖర్చు చేయాలని సూచించారు. ఇటీవలే ప్రారంభమయిన టి హబ్ మంచి ఫలితాలు ఇస్తున్నదని, మరో ఐటి ఇంక్యుబేటర్ కు కూడా నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ ఇప్పటికే

పలు కంపెనీలతో కిక్కిరిసిపోయినందున ఇక ముందు వచ్చే కంపెనీలను వరంగల్ తరలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వరంగల్లో కూడా ఐటి రంగం విస్తరణకు మంచి అవకాశాలున్నాయన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణాభివృద్ధికి ఉపయోగించాలి

-----------------------------------------------

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఉభయ తారకంగా ఉపయోగించుకోవాలని, అందుకు సంబంధించి ఏ కార్యక్రమాలు తీసుకోవాలనే విషయంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు సూచించారు. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిపై శనివారం క్యాంపు కార్యాయలంలో సమీక్ష జరిగింది. మంత్రులు కె.టి. రామారావు, ఈటెల రాజెందర్, ఎ.ఇంద్ర కరణ్ రెడ్డి, అధికారులు ఎస్పి సింగ్, అనితా రామచంద్రన్, స్మితా సభర్వాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేల కోట్లు ఖర్చవుతున్నప్పటికీ, గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని, ఆస్తుల సృష్టి లేదన్నారు. అటు ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలకు ఉపయోగపడే నిర్మాణాలు జరగాలన్నారు. ఉపాధి హామీ పథకం నిబంధనలు అనుసరించి కార్యక్రమాలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో స్మశాన వాటికలు, సిసి రోడ్లు, మురికి కాలువలు, మరుగుదొడ్లు, గ్రామ పంచాయితీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాల లాంటి నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం నిధులు వాడుకోవాలని సిఎం చెప్పారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్, గ్రామ పంచాయితీకి కీలక పాత్ర ఉందని, వారి హక్కులు, విధులు, బాధ్యతలు గుర్తించేలా ప్రభుత్వం తరుఫున మార్గదర్శకాలు రూపొందించి, కఠినంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ కార్యదర్శుల విధులకు సంబంధించి కూడా మార్గదర్శకాలు తయారు చేయాలన్నారు. పంచాయితీ రాజ్ పరిధిలో జరిగే నిర్మాణాలను సకాలంలో చేసిన కాంట్రాక్టర్లకు కూడా ఐబి, ఆర్ అండ్ బి మాదిరిగా 1.5 శాతం ఇన్సెంటివ్ ఇవ్వాలని ఆదేశించారు. స్వయం సహాయక బృందాలను మరింత బలోపేతం చేయాలని, వారికిచ్చే వడ్డీ లేని రుణాలు సకాలంలో అందేలా బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**